# అల–వల–తల

## అల

శ్రీనివాసులు లాడ్జింగుకి చేరేసరికి మధ్యాహ్నం మూడుగంటలైంది. ఇండియన్ రైల్వేలో ప్రయాణం చేసినందువల్ల ఆలస్యమైనా గమ్యం సజీవంగా చేరినందుకు సంతోషపడ్డాను. తీరా లాడ్జింగుకి చేరేసరికి హౌసు పుల్లన్నాడు రిసెప్షన్లో కుర్రాడు. అదిగో–అప్పుడే శ్రీనివాసులికి బాధనిపించింది. రైలు గండంనుంచి బయట పడ్డానన్న సంతోషంకాస్తా చప్పున చల్లారిపోయింది. కనిపించని అదృశ్యశక్తి తనని మళ్ళీ రైలు బండీలో కూలేసి, కదలకుండా నొక్కి వేసినట్టుగా వర్రీ అయ్యేడు.

కానీ–

మనిషి చేసుకున్న పూర్వజన్మ పుణ్యం ఆపత్సమయంలో ఆదుకున్నట్టు, పాత పరిచయం పెట్టుబడిలా పన్జేసింది వచ్చిన ప్రతిసారి ఆదే హోటల్లో దిగే తన అలవాటుకి తనకు తానే అభినందించుకున్నాడు– రిసెప్షన్‌లోని అమితాబ్ (అలాగని అనుకుంటాడతను) కాస్సేపు ఫోన్లో మాట్లాడి, ఆ పైన రూమ్ బోయ్‌తో ఏదో విషయంపై ఘర్షణపడి, తన ముందున్న పొడుగాటి రిజిష్టరు వైపు తదేకంగా చూసి– అప్పుడు గాని దూరంగా, దీనంగా నిల్చున్న శ్రీనివాసుల్ని రమ్మనమన్నట్టుగా సంజ్ఞ చెయ్యలేదు.

సంజ్ఞనందుకున్న శ్రీనివాసులు కాళ్ళలో స్ప్రింగులు వున్నట్టు ఒకేఒక గెంతుతో కౌంటరు దగ్గిరకెళ్ళాడు.

"డబుల్‌రూము రిజర్వేషన్ కాన్సిలయింది తీసుకుంటారా" అనడిగాడు రిసెప్షన్ కుర్రాడు.

శ్రీనివాసులికి ఆ మాట వినంగానే ప్రాణం లేచొచ్చింది. ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా ఎటువంటి సందేహానికి తావులేనట్టు తలూపి పర్సు బయటికి తీసేడు. అతడ్రాక్షణంలో డబుల్ రూమేకాకుండా, త్రిబుల్ రూమో, జనరల్‌వార్డో అద్దెకుంది కావాలా అనడిగితే సరేనని సంతోషంగా పుచ్చేసుకునేటట్టున్నాడు.

అవునుమరి– పరిస్థితి అలాగుంది.

రైల్లో ప్రయాణం వల్ల వళ్ళంతా బడలికగా, బరువుగా వుంది. ఎటూ కానివేళ– ఎండ బయట పెళపెళ లాడుతోంది. ఆకలి మండుతున్న కొరివిపెట్టి కడుపుని దహించేస్తోంది. విశ్రాంతి, తిండి, స్నానం వీటిల్లో ఏదిముందో, ఏది ముఖ్యమో తేల్చుకోలేని స్థితిలో, దేనికైనా రూము జరూరు కాబట్టి డబుల్‌రూమైనాథ్మామని పుచ్చేసుకున్నాడు.

శ్రీనివాసులు ఎడ్వాన్సు ఇచ్చేసి, సంతకం పెట్టి బాయ్ లగేజీతో వెంటరాగా రూమువైపు దారితీసేడు– ఆ హోటల్లోని రూమ్ బాయిసందరికి అతడు చిరపరిచితుడే. వెళ్ళేటప్పుడు టిప్పులు బాగా ఇస్తాడని ప్రతీతి. అందువల్లే అతడక్కడదిగేడని తెలియగానే ఆ హోటల్లో పన్జేసే కుర్రాళ్ళంతా టిప్పు శ్రీనివాసులి రూముకి ట్రిప్పులేసి నమస్కారాలు చేసి వెళ్ళిపోతూంటారు. ఇదంతా తెలీనివాళ్ళు ఆగది ముందు అంతమంది కుర్రాళ్ళని చూసి, సస్పెన్సునవలని మధ్యలో మొదలెట్టిన పాఠకుడిలా వెర్రిగా మొహంపెట్టి, ఆగదిలో ఎవరో సినిమావాడన్నా వుంటుండాలి, లేకుంటే దాంట్లో మర్డరన్నా జరిగుండాలనుకుంటారు.

శ్రీనివాసులు రూమ్‌లోకి ప్రవేశించి ప్యాంటు షర్టువిప్పి టవలు చుట్టుకున్నాడు బాయినిపిల్చి ఒక బీరు, భోజనం తెమ్మని చెప్పి బాత్రూంలో కెళ్ళాడు.

చేసేది సేల్సురి ప్రజెంటేటివయినా, చూసేందుకు బిజినెస్ చేసేవాడిలా వుంటాడు. అటు పొట్టి ఇటు పొడుగుకాని మధ్యస్థమైన ఎత్తు, దానికి మించినలావు– క్లీన్‌షేవు చేసుకున్న గుండ్రటి మొహం, బట్టతల, అలవాట్లకి ప్రతిరూపకంగా విస్తరిస్తున్న పొట్ట– సిల్కులాల్చీ వేస్తే సినిమావాడిగాను, ఖద్దరులాల్చీ వేస్తే ప్రజాసేవ

చేసే వ్యాపారిగాను అగుపిస్తాడు. నెలకిరవై రోజులు టూరింగులో వుండటం చేత, డబ్బుగూడా లోటు లేకుండా ఎలక్షన్ ఫండులా సమృద్ధిగా వుండటం చేత కాస్త భారీగానే ఖర్చు చేస్తాడు.

శ్రీనివాసులు స్నానం పూర్తి చేసి ఇస్త్రీ లుంగీ ధరించేడు. నీటుగా తలదువ్వుకున్నాడు. వళ్ళంతా పౌడరు పూసుకున్నాడు (మొహానిగూడా!) ఆ పైన బాయ్ గురించి ఎదురు చూస్తూ మంచం పైన కూర్చున్నాడు. బీరు వోపెన్ చేసి గ్లాసులో పోసి టిపాయిపై నుంచేడు. భోజనం గూడా ప్రక్కనే వుంచేడు.

శ్రీనివాసులు ప్రసాదాన్ని అలాగే వుంచి తీర్థాన్ని సేవించటం మొదలు పెట్టేడు.

అంతలో హోటలు కుర్రాడు అతడి పెట్టె తెరచి బట్టల్ని, వస్తువుల్ని, షెల్ఫులో అమరుస్తున్నాడు. హోటల్ కుర్రాళ్ళు ఇలాంటి పన్లు అందరికి చెయ్యరు. టిప్పు శ్రీనివాసుల్లాంటి వారికి తప్ప.

శ్రీనివాసులు అంతా గమనిస్తూనే చల్లటి బీరుని ఆప్యాయంగా తాగుతున్నాడు ఆ కుర్రాడు ఎక్కడి సామాన్ను అక్కడ నీటుగా సర్దేసి, పెట్టెని మంచంకిందికి నెట్టి, సలాం కొట్టి తప్పుకున్నాడు

సరిగ్గా అప్పుడే చూసేడుదాన్ని శ్రీనివాసులు.

మంచానికి ఆవలగా, షెల్ఫుకి దిగువుగా చిన్న కాగితం మడతపడుతుంది.

అతడు గ్లాసులోని ద్రవాన్ని గొంతులో పోసుకుని, సీసాలోంచి మిగిలినదాన్ని గ్లాసులో పోసుకున్నాడు– మళ్ళీ తదేకంగా ఆ కాగితం మడత కేసి చూడనారంభించేడు.

అది తన పెట్టెలోంచి పడిందా? ఆ షెల్ఫులోంచి పడిందాని రెండు క్షణాలు దీర్ఘంగా ఆలోచించేడు. సరైన సమాధానం స్ఫురించక పోవటంతో, బీరుతాగుతున్నపుడు బుర్రపాడు చేసుకోవటం ఇష్టంలేక చటుక్కున లేచెళ్ళి ఆ కాగితాన్ని చేతిలోకి తీసుకుని, తిరిగి యధాస్థానంలో కొచ్చి కూర్చున్నాడు గ్లాసెత్తి రెండు గుటకలేసి, సిగరెట్టు అంటించి, చేతిలో వున్న కాగితాన్ని విప్పేడు.

కాగితం సాధారణమైంది. ఏ న్యూసు పేపర్లోంచో వీక్లీనుంచో పొడుపుగా, నేర్పుగా చింపినట్లుంది. దస్తూరి పొందికగా, పొంకంగా ఆకర్షణీయకంగా వుండి చూడగానే ఆడమనిషి చేతి వ్రాతగా ఇట్టే అర్థమైపోతోంది.

శ్రీనివాసులు కళ్ళు చిట్లించి అక్కడ వ్రాసున్నది చిదివాడు–

'రాజూ సాయంత్రం ఆరింటికి ఇందిరాపార్కులో బోటు షికారు వద్ద రావిచెట్టు క్రింద ఎదురుచూస్తుంటాను. తప్పక రావాలిసుమా! చాలా సంగతులు చెప్పాలి– కోమల'

అతడికి విచిత్రంగా అన్పించింది. అంచేత మళ్ళీ చదివాడు. మళ్ళీ మళ్ళీ చదివాడు. గ్లాసు పూర్తయ్యేవరకు చదువుతూనే వున్నాడు. ఆలోచిస్తూనే వున్నాడు.

ఆ కాగితం తనదికాదు. కాని ఎక్కడ్నించి వచ్చింది. ఆ షెల్ఫులోంచి పడిందా? మెసేజ్ వ్రాసిన ఆమె రాజన్ అనే అతడికి అందచెయ్యకుండా ఇక్కడెందుకుంచింది? మర్చిపోయిందా? లేక అతడికడికొచ్చి తీసుకుంటాడనుకుందా? అయినా ఈ కోమలెవరు? ఈకోమల రాజెవడు? అసలీ కథేమిటి– హిచ్‌కాక్ సినిమాలా–

ఆలోచనన్లాపి భోజనం మొదలెట్టాడు ప్రక్కనే వున్న బెల్ నొక్కేడు.

రూముబోయ్ వెంటనే ప్రత్యక్షమైనాడు శ్రీనివాసులు అతడ్నికూర్చోమన్నాడు. అతడు మొదట సందేహించి, ఆపైన అక్కడే టీపాయికి ప్రక్కగా చతికిలపడి కూర్చున్నాడు.

శ్రీనివాసులు భోంచేస్తూనే సంభాషణ ప్రారంభించేడు.

"నిన్న ఈ గదిలో ఎవరున్నారు?

"ఎందుకండి" అయోమయంగా అడిగాడు ఆ కుర్రాడు.

"అహ– ఏం లేదు– వూరికేనే అడుగుతున్నా– ఎవరున్నారు?"

"మొగుడూ పెళ్ళాంవండి– ఆళ్ళూ మీలాగే ప్రతినెలా వత్తారండి. ఇక్కడే దిగుతారండి"–

"వాళ్ళెప్పుడు  ఖాళీ చేసి వెళ్ళారు?" అని తిరిగి ప్రశ్నించాడు.

"ఇయ్యాలే పొద్దుగాల ఎనిమిదింటి కెళ్ళిపోయారండి – ఆళ్ళు మీగాని

తెల్సా?" అనుమానంగా అడిగాడు.

"అబ్బే అదేం లేదు– "శ్రీనివాసులు కూర పూర్తిచేసి, అన్నంలో చారు కలుపుకున్నాడు.

"ఆళ్ళిద్దరూ బలే ఇచిత్రమైన మడుసులండి" అన్నాడాకుర్రాడు.

అతడామాట అనకుండా వుంటే సంభాషణ అక్కడితో ఆగిపోయుండేది. అతడన్న ఆ మాటతో శ్రీనివాసులికి వుత్సాహంకట్టలు తెంచుకుని ఆలలు ఆలలుగా ప్రవహించగా–

## వల

"ఎందకలా అంటున్నావ్?" అని ప్రశ్నించేడు.

"ప్రతి నెలావచ్చి అయిదారు దినాలుంటూరండి. మొదటిరోజు సక్కగుంటారండి. ఆ తర్వాతినించి గొడవ మొదలవుద్దండి. ఆయమ్మ కోసరం ఓ నల్లటికుర్రాడు బుల్లెట్ బండీపై వత్తాడండి. అడొచ్చినట్టు తెలీంగానే ఆయనగోరు ఆమెని సితకతంతారండి. ఆమె లబోదిబోమని ఏడుత్తుందండి. రాత్తిరికిద్దరూ మస్తుగా తాగేత్తారండి–"

"ఏమిటి ఆవిడ కూడా తాగుతుందా?" చెయ్యి కడుక్కోబోయి ఆ విషయాన్ని మర్చిపోయి ఆశ్చర్యంగా అడిగాడు.

"తాగుతుందా? ఆవిడగోరు తాగినట్టు మీరెంతాగ్గలరండి? సరే– ఆళ్ళిద్దరూ తాగేసి కాస్సేపు పోట్లాడుకుంటారండి– తిట్టేసుకుంటారండి– ఆ పైన ఇద్దరూ గొల్లుమనేడుస్తారండి– మీల్సు తెప్పిస్తారుగానితిన్రండి– అట్టాగే పడుంటారండి– తెల్లారి ఆయనగోరటెళ్ళగానే బుల్లెట్టు బుల్లోడు బర్రుమనొచ్చి తలుపేత్తాడండి– అది తెల్సి రాత్రికి మళ్ళీ మొదలండి"

శ్రీనివాసులు లేచి వాష్‌బేషిను దగ్గర కెళ్ళబోతూ  ఆడగవలసిన పాయింటడిగాడు. "అవును – ఆ కుర్రాడొచ్చినట్టు ఆయన కెట్లా తెలుస్తుంది?"

'రూముకాడుండే కుర్రాడికి డబ్బులిచ్చి సెప్పమంటారండి"

"ఓహో" అనేసి వెళ్ళి చెయ్యి కడుక్కుని వచ్చి మంచంపై కూర్చున్నాడు. శ్రీనివాసులు. అతడు చెపుతున్న విషయం చాలా ఆసక్తిగా అన్పించింది. తాను చదివిన కాగితానికి, వింటున్న కథకి చాలా దగ్గర బంధుత్వం వున్నట్లనిపించింది. సిగరెట్టు తీసి వెలిగించుకుని, రిలాక్సింగవుతున్నట్లు సర్దుక్కూర్చుంటూ మళ్ళీ అడిగాడు.

"అయితే వుదయం వెళ్ళేటప్పుడు ఇద్దరూ బాగానే వున్నారా?"

"అంటే?"

"అంటే – ఇద్దరూ సంతోషంగానే వెళ్ళారాని"

"అబ్బే లేదండి– రాత్రిబాగా సితకతన్నుంటాడు– ఏడుత్తూ యెళ్ళిందండి– గది అయిదు రోజులకని తీసుకున్నారండి– కాని రెండ్రోజులకే యెళ్ళి పోయారండి"–

"అలాగా"

"అవునండి– ఆవిడ మంచిమడిసికాదని మా సిమ్మాచెలం సెప్పాడండి–"

"వాడెవడు?"

"రూముకు ర్రాడండి– ఆడికోసారి పెద్ద అనుభవమైందండి"

శ్రీనివాసులికి వినటానికి మహానందంగా వుంది. తాగే ఆడవాళ్ళంటే అతడికిష్టం. వాళ్ళ కంపెనీకోసరంపడి చస్తాడు. అతడి భార్య పాపాయమ్మ పూర్వకాలం మనిషి. ఆచారాలు వ్యవహారాలు అంటుంది. మడీ దడీ అంటుంది. తిధివార నక్షత్రాలు లెక్క కడుతుంది. అతడు వూళ్ళో వుండేవారం రోజుల్లో, అయిదు రోజులు మడిలోను, మూడ్రోజులు బయటకూర్చుంటుంది. అంచేత భార్య ఛాదస్తాన్ని చూస్తుంటే వళ్ళు మండుకొస్తుంది. అంతమాత్రం చేత భార్య తనతోపాటుగా తాగాలనుకోడు–

మనందర్లాగానే అయినా తాగే ఆడవాళ్ళంటే చచ్చేటంతిష్టం– ఒక్క పాపాయమ్మ తప్ప ప్రపంచంలో ఆడవాళ్ళందరూ తాగాలని, అందులో తప్పులేదని గట్టిగా అనుకుంటాడు.

"ఏవిటైంది?"

గుచ్చిగుచ్చి అడగటం చేత ఆ కుర్రాడికి ఆసక్తి పెరిగి చెప్పుకుపోతున్నాడు.

"ఒకరోజు రాత్రి సిమ్మాచెలం డూటీలో వున్నారండి. అర్ధరాత్రి బెల్లుకొట్టి పిలిచిందండి. అప్పటికే మొగుడుగారు మందు కొట్టి అవుటయ్యారండి. ఈవిడగారందుకు సిద్ధంగా వున్నారంటండి"

"ఆ తర్వాత?"

"ఇది మరీ బాగుందండి– ఆ తర్వాత ఏటయినాదో నాకేం తెలుసునండి– కాని తర్వాత సిమ్మాచెలం సెప్పాడండి– ఆవిడ గోరుమంచోరుకాదని"

"ఏడ్చాడు వెధవ– ఈఆలగా వెధవలకి మంచికీ చెడుకీ విచక్షణ తెలీదు– అదే ఆడమనిషి సాక్షాత్తు తననే గనక చెయ్యిపట్టి లోపలికి లాక్కుంటే అలా అనుండేవాడా? ఛస్తే అనడు– ఆవిడ చాలా మంచిదని, నిప్పులాంటిదని చెప్పేవాడు" అని మనస్సులోనే అనుకుని కళ్ళుమూసుకున్నాడు.

విన్నదంతా దృశ్యరూపంలో వూహించుకోసాగేడు. సింహాచలం స్థానంలో తనని వూహించుకుని చూసుకోసాగేడు. త్రాగిన బీరు అందుకు సాయపడింది తన శక్తిమేరకి.

శ్రీనివాసులు కాస్సేపుమాట్లాడపోయే సరికి ఆ కుర్రాడులేచి ఎంగిలి పళ్ళాన్ని తీసికెళ్ళే కార్యక్రమం మొదలు పెట్టేడు. కొద్దిక్షణాలకి కళ్ళు తెరచి వెళ్ళిపోతున్న ఆ కుర్రాడినడిగాడు–

"అన్నట్టు– నీ పేరేమిటి?"

"కనకారావండి"

"సరే ఆమె ఎలాగుంటుంది?"

"చాలా అందంగా వుంటుందండి– జాకెట్టుకి సేతులుండవండి. పెదాలకి రంగుంటుందండి. తలకినూనె వుండదండి. కళ్ళకి జోడుంటుందండి. మొగాళ్ళ వంక అదోలా చూస్తుంటుందండి"

"సరెసరె– నువ్వెళ్ళు"

"ఏవండి– అలా అడిగేరు?"

"ఏంలేదు– వెళ్ళు"

కనకారావు తలుపు మూసి వెళ్ళిపోయేడు.

అటు తర్వాత శ్రీనివాసులు కొద్దిసేపు తన వుద్యోగ వ్యవహారాలు చూసుకున్నాడు. అరడజను టెలీఫోన్ కాల్సు చేసేడు, కానీ ఎవ్వరూ దొరికేరు కారు. దొరికిన ఒకళ్ళిద్దరూ రేపుదయం వచ్చి కలవమని చెప్పటం చేత సాయంత్రానికి కార్యక్రమం లేకుండా పోయింది.

కళ్ళు మూసుకుని కాస్సేపు నిద్రపోవాలని ప్రయత్నించేడు. కాని నిద్ర వచ్చే సూచన్లు ఏ మాత్రం కన్పించలేదు. ఆలోచన్లు కనకారావు చెప్పిన మనిషివైపే పరిగెడుతున్నాయ్. ఆ ఆలోచనలని ఆపటం కష్టమైన పనిగాతోచింది. అదేవిటో ఆ ఆడమనిషి ఎవరిలా గదిలోకొచ్చినట్టు, మందు తెప్పించమని అడిగినట్టు. ఇద్దరూ కలసి సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ తాగినట్లు, మధ్య మధ్యలో తను చిలిపిగా అల్లరి చేసినట్టు, ఆ పైన...

శ్రీనివాసులు లేచి కూర్చున్నాడు. సిగరెట్టు వెలిగించేడు– టైమ్ చూసేడు– అయిదున్నర

టీపాయి పైన ఎదురుగా కనిపిస్తున్న కాగితాన్ని తిరిగి చేతిలోకి తీసుకుని ఇంకోసారి చదివాడు.

"ఇదిరాపార్కు–బోటు షికారు ప్రక్క రావిచెట్టువద్ద– ఆరింటికి"–

బద్ధకంగా వళ్ళు విరుచుకుంటుండగా– ఆలోచన బుర్రలో ఫట్‌మని పేలింది–

ఇందిరాపార్కు కెడితే? అసలామనిషి ఎలా వుంటుందో చూడొచ్చుగందా! చేసే పని మాత్రం ఏం వుందని?

రైటో–

లేచి మొహం కడిగి పౌడరు పూసి, ఇస్త్రీ బట్టలు ధరించేడు

ప్రాణం హాయిగా వుంది. సంతోషంగా వుంది. థ్రిల్లుగా వుంది.

మనీపర్సు తీసి జేబులో వేసుకుని, బయటికొచ్చి రూము లాక్‌చేసేడు. కనకారావు వరండాలోనే ఎదురైనాడు.

"బయట కెడుతున్నారా?" అనడిగాడు.

అవునని తలూపి, జేబులోంచి చిల్లరతీసి వాడికిచ్చి ముందుకుసాగేడు.

ఇందిరాపార్కు ఆవేళటప్పుడు పార్కు లాగా కాకుండా యాత్రాస్థలంలాగానో ఎగ్జిబిషన్‌లాగానో వుంటుంది.

వంటరివాళ్ళు, జంటలవాళ్ళు, సంసారాల వాళ్ళు, అవి లేనివాళ్ళు, పెళ్ళయిన వాళ్ళు, కావాలనుకునే వాళ్ళు, చేసుకుని చేతులు కాల్చుకున్న వాళ్ళు...

శ్రీనివాసులు ఆ ప్రదేశానికి రావటం అదే ప్రథమం అయినా పార్కు అందచందాల గురించి పట్టించుకునే వ్యవధి లేకపోవటంచేత, అతడి కళ్ళు బోటు షికారు స్పాటు కోసం ఆత్రంగా వెతుకుతున్నాయ్–

కాస్సేపటికి అతడి కృషి ఫలించింది. అక్కడ చాలా రద్దీగా వుంది. గొడవగా వుంది.

అతడు దాన్ని దాటి కాస్త ముందుకెళ్ళాడు. కాస్తదూరంగా రావిచెట్టు. అది మసక వెల్తుర్లో బ్రాహ్మరాక్షసిలా నిల్చునుంది. ఆ చెట్టు క్రిందగా ముగ్గురుకు ర్రాళ్ళుకూర్చుని రహస్యంగా మాట్లాడుకుంటున్నారు. వాళ్ళకి కాస్త దూరంలో ఒక ఆడమనిషి నిల్చునుంది. జాకెట్టుకి చేతుల్లేవు... ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టుగా నిల్చునుంది.–

శ్రీనివాసులుకి సంతోషంతో గుండె జల్లుమంది. అసలు హోటలు నుంచి బయల్దేరాక పెద్ద అనుమానం మొదలైంది. వాళ్ళిద్దరూ గది ఖాళీ చేసి వెళ్ళారుగదా ఆమెలా పార్కుకొస్తుంది– అని. కాని– తాగేటంతగా అడ్వాన్సయిన ఆడది ఏవైనా చేస్తుంది, ఎలాగైనా వస్తుంది అన్న మొండిధైర్యంతో వచ్చేడు– కష్టం వృధాకాలేదు.

అతడు కదిలి ఇంకాస్త ముందు కెళ్ళాడు. ఆమెని పరీక్షగా చూస్తున్నాడు– అంతలో అక్కడ కూర్చున్న ముగ్గురిలోఒకకుర్రాడు లేచొచ్చి శ్రీనివాసుల్ని ఏదో అడిగాడు.

అతడు బదులిచ్చాడు.

ఆ కుర్రాడు మళ్ళీ ఏదో అడిగాడు.

శ్రీనివాసులేదో చెప్పాడు.

అంతలో మిగిలిన ఇద్దరూ గూడా వచ్చారు. ముగ్గురు తలో ప్రశ్న అడిగేరు. శ్రీనివాసులు కంగారుగా ఏదో చెప్ప ప్రయత్నిస్తూండగా– అందులో ఒక కుర్రాడు శ్రీనివాసులు చొక్కా పుచ్చుకుని, బలంగా వెనక్కి నెట్టేడు–

శ్రీనివాసులు క్రిందపడ్డాడు– పడుతూ ఆమె వైపు చూసేడు. ఆమె అక్కడే నిల్చుని ఎదురుచూస్తోంది.

క్రిందపడటం వరకు శ్రీనివాసులకి తెల్సు–

ఆ తర్వాతం ఏం తెలీదు–

తల

దాదాపు గంట తర్వాత శ్రీనివాసులు హోటలు ముందు రిక్షా దిగేడు– తలకికట్టు– చేతులుకాళ్ళకి దెబ్బలు– బట్టలు మాసిపోయినట్టు అసహ్యంగా వున్నాయి.

జేబులోంచి వున్న చిల్లరంతా తీసి లెక్కపెట్టి రిక్షావాడికిచ్చేడు. లోపలికొస్తుంటే కనకారావు అదుర్దాగా ఎదురొచ్చేడు "ఏంటి బాబూ ఏక్సిడెంటా?" అన్నాడు చెయ్యి సాయం అందిస్తూ.

"అవున్రా– రిక్షాని లారీగుద్దేసింది" అంటూ నడుస్తున్నా లోపల కట్లుకట్టిన డాక్టరు ఫీజు, హోటలుబిల్లు ఎలాకట్టాలని, ఎవర్నడగాలాని ఆలోచిస్తూనే వున్నాడు.

రిసెప్షన్లోని అమితాబ్ విచిత్రంగా శ్రీనివాసుని వాలకం చూస్తుండగా ఫోన్ మోగింది– అందుకుని, శ్రీనివాసునికి సాయంపట్టి నడిపించుకెడుతున్న కనకారావుని ఫోనొచ్చిందంటూ పిలిచేడు.

కనకారావు శ్రీనివాసుల్ని అక్కడే వుండమని చెప్పి పరిగెత్తుకుంటూ వచ్చి ఫోనందుకున్నాడు.

కాస్సేపు అవతలవైపు నించి చెబుతున్న దంతావిని "మొత్తం ఎంత?" అనడిగాడు.

"ఆరొందలు– అంతే వున్నాయి– నీవాటా డ్యూటీనించి వెళ్ళేటప్పుడు వచ్చి తీసికెళ్ళు" అంది అవతలి గొంతు.

"అలాగే " అనేసిన ఫోన్ పెట్టేసి, నిలబడి పోయిన శ్రీనివాసులి వైపుగా పరిగెత్తాడు కనకారావు అనే రాముబాయ్–